క్లుప్తంగా

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని వెంకటనగరం గ్రామ శివారు తోటపల్లి గిరిజన తండాలో సారా బట్టీలపై సోమవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేత్త సుబ్బారావుకు సన్మానం


లింగంపర్తిలో సుబ్బారావును సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో సోమవారం ఆధ్యాత్మిక వేత్త ఆలమూరి సుబ్బారావును ఘనంగా సన్మానించారు. గ్రామంలోని హనుమాన్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సుబ్బారావును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు సుబ్బారావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా సుబ్బారావు హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కప్పల వెంకటస్వామి, కప్పల మణికంఠ, పూర అప్పన్న, వాగు బాబులు, మాటూరి సూరిబాబు, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వరివడిగా రబీసాగు


ముక్కొల్లులో వరి సాగుకు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

కిర్లంపూడి: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో రబీ వరిసాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ పూర్తి కావడంతో రైతులు రబీ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను నిరాశ పరిచింది. పంటలు చేతికొచ్చే సమయంలో వరుస తుపానులతో వరి పంటలు నీట మునిగాయి. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఖరీఫ్ నష్టాలను పూడ్చేందుకు రైతులు రబీ సాగుపై దృష్టి సారించారు. ఏలేరు కాలువ దిగువన ఇప్పటికే రబీ వరినాట్లు ప్రారంభించారు. కిర్లంపూడి, రాజుపాలెం, వీరవరం, ముక్కొల్లు, గోనేడ, రామచంద్రపురం, తామరాడ, భూపాలపట్నం గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో రబీ వరి నాట్లు వేయడానికి రైతులు సన్నద్ధమయ్యారు. కిర్లంపూడిలో ఇప్పటికే సుమారు 7 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేశారు. జగపతినగరం, చిల్లంగి, సింహాద్రిపురం, వేలంకతో పాటు పలు గ్రామాల్లో అపరాలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ-2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:	
తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217


జగన్నాథగిరిలో భోగి మంట వద్ద గుమికూడిన జనం


జగ్గంపేటలో భోగి మంటలో వేసిన భారీ భోగి పిడకల దండ


ప్రత్తిపాడులో భోగిమంట చుట్టూ తిరుగుతున్న బ్రహ్మకుమారీలు

ఊరూవాడా భోగిభాగ్యాలు

- సంప్రదాయబద్ధంగా భోగి పండుగ
- గ్రామాల్లో సందడి వాతావరణం
- జోరుగా కోడి పందేలు

తుని/తునిరూరల్/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/జగ్గంపేట/తొండంగి/శంఖవరం: భోగభాగ్యాలు కలిగించే భోగి పండగను సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే నిద్ర లేచి సేకరించిన కలప, పిడకలను కూడలి మధ్యలో వేసి భోగి మంటలు వేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొత్త అల్లుళ్లు భోగి స్నానాలు చేసి కూడళ్లలో వేసిన భోగి మంటలు వద్ద స్నేహితులు, బంధు మిత్రులతో సరదగా గడిపారు.

కోడిపందేలకు అనుమతులు

సంక్రాంతి పండుగ వస్తే చాలు కోడిపందేలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. తుని నియోజకవర్గంలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాలతో పాటు తుని పట్టణంలో 60 బరులు ఏర్పాటు చేశారు. స్థాయిని బట్టి ధర నిర్ణయించారు. పోలీసులు మాత్రం కోడి పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ప్రచారం చేశారు. పందేలు జరిగే ప్రాంతాల్లో గుండాట, పేకాట, బెల్ట్ షాపులు, భోజనాలు ఏర్పాటు చేశారు. ఇందుకు కోసం నిర్వాహకులు ఫీజులు వసూలు చేశారు.

సిటీ వాకర్స్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు

తుని పట్టణంలోని గణపతినగర్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు పలువురు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను క్లబ్ మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్.మూర్తి వివరించారు.


జి.కొత్తపల్లిలో భోగి మంట వద్ద గ్రామస్తులు


తుని గణపతినగర్‌లో భోగి మంట వేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ఎస్.అన్నవరంలో...

తుని మండలం ఎస్.అన్నవరంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, తేటగుంటలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండగను జరుపుకున్నారు. భోగి మంటల వద్ద నీళ్లను మరిగించి తలస్నానాలు ఆచరించారు. ఎస్.అన్నవరం, వి.కొత్తూరు, తేటగుంట, హంసవరం, ఎన్.సూరవరం, డి.పోలవరం, కేఓ.మల్లవరం, రాపాక, దొండవాక, రేఖవానిపాలెం, జగన్నాథగిరి, చేపూరు, ఎస్.చామవరం, కొలిమేరు గ్రామాల్లో భారీ భోగి మంటలు వేశారు. పిల్లలు మంటల్లో గోపిడక దండలు వేసి సందడి చేశారు.

ఏలేశ్వరం పట్టణ, రూరల్ పరిధిలో...

ఏలేశ్వరంలోని పల్లపువీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల ప్రధాన కూడళ్లలో తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. చిన్నారులు ఆవుపిడకలతో చేసిన దండలను భోగి మంటల్లో వేశారు. చిన్నలు, పెద్దలు నూతనవస్త్రాలు ధరించి మంటల వద్ద గుమిగూడారు. కాగా సాయంత్రం మూడేళ్లలోపు చిన్నారులకు భోగిపళ్లు వేసి వేడుకలు నిర్వహించారు. చుట్టుప్రక్కల బంధువులు, స్నేహితులను పిలిచి బహుమతులు అందజేశారు. ఏలేశ్వరం మండలంలోని లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తిరుమాలి తదితర గ్రామాల్లో భారీఎత్తున భోగి మంటలు వేశారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు మండల ప్రజలు భోగి పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే చలిపులిని లెక్క చేయకుండా సేకరించిన కలప, చెక్కలను, దుంగలను ఒకచోటకు చేర్చి మంటలను వెలిగించారు. వాడవాడలా భోగి మంటలు సందడి చేశాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా వేకువ జామునే లేచి, నలుగుపిండితో మంగళ స్నానమాచరించి భోగి మంటల వద్దకు పరుగులు తీశారు. తమ ఇళ్లలో పనికిరాని, పాత కలప వస్తువులను భోగి మంటల్లో వేసి పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికారు. ఆవు పేడతో చేసిన పిడకల దండలను భోగి మంటలో వేసి సందడి చేశారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. పోలీసులు ఎన్ని ఆక్షలు విధించిన గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. గ్రామాల్లో హరిదాసుల సందడి కనిపించింది. ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో భోగి వేడుకలను నిర్వహించారు.

175 అడుగుల పిడకల దండతో సందడి

జగ్గంపేటలో భారతీయ ధర్మపరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు 175 అడుగుల భారీ భోగి పిడకల దండను తయారు చేశారు. ఈ దండను సోమవారం ఉదయం తమ ఇంటి వద్ద వేసిన భోగి మంటలో 15 మంది సాయంతో వేశారు. భోగి మంట ప్రాధాన్యతను స్థానికులకు వివరించారు.


ధర్మవరంలో భోగి మంట వెలిగిస్తున్న వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు


ప్రత్తిపాడులో చిన్నారులకు భోగిపండ్లు వేసి, హారతిలిస్తున్న దృశ్యం

ఆలయాలకు భక్తుల తాకిడి

భోగి పండగను పురస్కరించుకుని సోమవారం తొండంగి, దానవాయిపేట, ఏవీ నగరం, బెండపూడి, యర్రయ్యపేట, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రావికంపాడు మహిషాసురమర్దిని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో యువత భోగిమంటలు వేశారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు.

ఘనంగా సత్యదేవుని గ్రామోత్సవం


గ్రామోత్సవంలో సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో అర్చకస్వాములు


రత్నగిరిపై భోగి పండ్లు వేసి చిన్నారులను ఆశీర్వదిస్తున్న తపోవనం స్వామీజీ

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి గ్రామోత్సవం సోమవారం అన్నవరంలో ఘనంగా జరిగింది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డు, ఇండియన్ బ్యాంక్ వెనుక వరదయ్యవీధి, వెలంపేట ప్రాంతాల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఏటా భోగి నాడు మాత్రమే ఈ వీధుల్లో స్వామివారిని ఊరేగిస్తారు. భక్తులు స్వామివారి పల్లకీకి ఘనంగా స్వాగతం పలికి స్వామివారికి నివేదనలు సమర్పించారు. అర్చకులు కంచిబట్ల సాయిరామ్, పరిచారకుడు యడవిల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కంచిబట్ల రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిన్నారులకు భోగిపళ్లు

భోగిని పురస్కరించుకుని రత్నగిరిపై సోమవారం భోగిపళ్ల కార్యక్రమం నిర్వహించారు. తుని తపోవనానికి చెందిన సచ్చిదానంద సరస్వతీ స్వామిజీ చిన్నారులకు భోగిపళ్లు వేసి ఆశీర్వదించారు. ఈఓ వీర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గండేపల్లి: పండగ వేళ మోటార్ సైకిలిస్టుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై తాళ్లూరు వైపు వస్తుండగా జీయ్యన్న మఠానికి సమీపంలోని మలుపు వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అతనికి ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికులు కాలువలో పడిన మోటార్ సైకిల్‌తో పాటు అతడిని రోడ్డుపైకి తీసుకువచ్చారు.

ఆరుగురి జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు గ్రామాల్లో జూదమాడుతున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సోమవారం తెలిపారు. మండలంలోని పోతులూరులో గుండాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను, వెంకటనగరం, ధర్మవరం గ్రామాల్లో కోడి పందేల శిబిరాలపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.2,750 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం


ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గాలి దేవుడిని సత్కరిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా జరిగింది. గ్రామానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నా ప్రతి సంవత్సరం భోగి పండగ రోజున కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సోమవారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గాలి దేవుడు తొలి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం, ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా ఆయన సేవలను కొనియాడారు. ఈ సంవత్సరం నుంచి గ్రామానికి చెంది ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను అమ్మఆశ ఫౌండేషన్, కేఓ మల్లవరం మిత్ర మండలి ఆధ్వర్యంలో సన్మానించాలని తీర్మానించారు. కార్యక్రమంలో చిటికెల శ్రీనివాసరావు, గాలి రాము, లోకవరపు అచ్చియ్యనాయుడు, లోకవరపు గంగాధర్, సుర్ల సత్యనారాయణ, గౌరీనాయుడు, చుక్కా పెద్దన్న, పెంటకోట సురేష్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


చిన్నింపేటలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు


గోనేడలో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- వైభవంగా గోదారంగనాథుల కల్యాణం
- వేలాదిగా వీక్షించిన భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేటలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి కోవెలలో కల్యాణం నిర్వహించారు. అర్చకుడు పద్మనాభచార్యులు యల్లపు అజయ్, వీరాలక్ష్మి దంపతులతో కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు.

గోదాదేవి గ్రామోత్సవం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో సోమవారం గోదాదేవి (ఆండాళ్) అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

కిర్లంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోనేడలో వేంచేసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి గరుడ వాహనంపై సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. తొలిత ఆలయ అర్చకులు గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి రావులమ్మతల్లి జాతర


వెండి కవచాలంకరణలో రావులమ్మతల్లి

జగ్గంపేట: స్థానిక గ్రామ దేవత రావులమ్మతల్లి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మర్రిచెట్టు నీడన వెలిసిన అమ్మవారు తనకు ఆలయం కట్టవద్దని భక్తులకు కలలో కనపడి చెప్పడంతో అమ్మవారికి చెట్టు కిందే పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా సంక్రాంతి, కనుము రోజుల్లో అమ్మవారి జాతర నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఈ ఏడాది జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారిని కొత్తగా తయారు చేయించిన రథంలో గ్రామంలో ఊరేగించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు జీను రాంబాబు తెలిపారు. జాతర సందర్భంగా బాణసంచా కాల్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

మకర సంక్రాంతికి సర్వం సిద్ధం


ఏలేశ్వరంలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఏలేశ్వరం/తుని: తెలుగువారి సంప్రదాయ పండగ సంక్రాంతిని మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. ఏడాదంతా అష్టఐశ్వర్యాలతో తులతూలగాలని కోరుతూ పెద్దల పండగైన సంక్రాంతిని చేసుకుంటారు. తెల్లవారుజామునే లేచి తలస్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. పండగ సందర్భంగా ఇంటి వాకిళ్లను ముగ్గులతో అందంగా అలంకరించారు. అల్లుళ్ల కోసం రకరకాల పిండివంటలు చేశారు. పలు గ్రామాల్లో సంక్రాంతికి రకరకాల పోటీలు నిర్వహించారు. పండగను పురస్కరించుకుని వస్త్రా దుకాణాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అధిక ధరలు చెల్లించి మరీ వస్త్రాలు కొనుగోలు చేశారు. ఏజేన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పట్టణం కళకళలాడింది. కిరాణాదుకాణాల వద్ద సందడి నెలకొంది.

గంగిరెద్దులు, హరిదాసుల సందడి

సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో గంగిరెద్దులు, హరిదాసుల సందడి నెలకొంది. గ్రామాల్లో గంగిరెద్దుల వారు ఇంటింటా తిరిగి బియ్యం, పప్పుదినుసులు వసూలు చేశారు. వీరికి కొత్తగా పెళ్లైన వారు పెళ్లికి కొనుగోలు చేసిన కర్పూర దండలతోపాటు వస్త్రాలు నగదు అందజేశారు. అలాగే నెలరోజుల పాటు నగర సంకీర్తన చేసిన హరిదాసులు సంక్రాంతిని పురస్కరించుకుని బియ్యంతో పాటు కానుకలు స్వీకరించారు.

పిండి వంటలు రెడీ !

సంక్రాంతి పండుగ రోజున పితృదేవతలకు పూజలు, నైవేద్యం సమర్పించేందుకు ప్రతిఇంటా మహిళలు వివిధ రకాల పిండి వంటలను తయారు చేస్తున్నారు. పట్టణం, గ్రామాల్లో పాత, కొత్త కలయకతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ముఖ్యంగా గ్రామాల్లో వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభను వేదికలపై ప్రదర్శించే అవకాశాన్ని కల్పించారు.

తుని మార్కెట్లో సందడి

సంక్రాంతి పండగను పురస్కరించుకుని వివిధ రకాల దుస్తులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో తుని మార్కెట్‌లో సందడి నెలకొంది. మెయిన్‌రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, బాలాజీ రోడ్డు, బెల్లపువీధి, పెద్దవీధి, చిన్నవీధి, తదితర ప్రాంతాల్లో షాపులన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


తుని సంక్రాంతి సంబరాల్లో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు


గొబ్బెమ్మల వద్ద సందడి చేస్తున్న మహిళలు, బాలికలు

తుని: తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకుంటారని ఉపాధ్యాయురాలు జి.అమ్మతల్లి అన్నారు. తుని పట్టణంలోని పేరూరివారి వీధిలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు గోబ్బెమ్మలు పెట్టి కోలాటం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోగి పళ్లు పోసి దీవించారు. ఉపాధ్యాయురాలు అమ్మతల్లి సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో హారిక, భారతి, లక్ష్మి, అల్లు సత్య, రాజ్యలక్ష్మి, నాగబాబు, వెంకట లక్ష్మి, తుమ్మల వరలక్ష్మి పాల్గొన్నారు.